ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

సోమవారం 11 నవంబరు 2024

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- జిల్లా సమస్యలను ప్రస్తావిస్తామంటున్న మంత్రి, ఎమ్మెల్యేలు
- పరిష్కారం, నిధుల మంజూరుకు ప్రజల ఎదురుచూపు



వారిపైనే కొండంత ఆశలు!

పార్వతీపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ శీతాకాల సమావేశాల్లోనే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లాకు అధిక కేటాయింపులు ఉంటాయని ప్రజలు ఎంతో ఆశాభావంతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో జిల్లావాసులు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని మరోవైపు మంత్రి, ఎమ్మెల్యేలు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రధాన సమస్యలెన్నో ఉన్నాయి. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల వద్ద పెండింగ్ పనులు పూర్తి చేసి శివారు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాల్సి ఉంది. జిల్లా ప్రజలను ఏనుగుల బెడద నుంచి తప్పించాలి. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణాలు, కురుపాం నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కళాశాల పనుల పూర్తికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. తాగునీరు, రహదారుల తదితర సమస్యలను జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి అసెంబ్లీలో ప్రస్తావించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రాజెక్టులకు నిధులెంతో అవసరం..

- గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యాయి. వాటి ఆధునికీకరణతో పాటు కాలువల్లో పూడికతీత పనులు కూడా చేపట్టలేదు. దీంతో రైతులు సాగునీటి కోసం అష్టకష్టాలు పడ్డారు. ఈ దశలో స్థానిక ప్రజాప్రతినిధులు ఆయా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సి ఉంది. ప్రభుత్వ నుంచి నిధులు మంజూరు చేయించుకుని ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలి. రైతులకు సాగునీటి కష్టాలు తొలగించాల్సి ఉంది.
- తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి రూ.239 కోట్లు అవసరం. లైనింగ్ పనుల కోసం రూ.99.18 కోట్లు, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణల పూర్తికి రూ.140 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 20 గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉంది. ఇందులో పది గ్రామాలు మాత్రమే ఇప్పటివరకు ఖాళీ చేశారు. కాగా ఆర్అండ్ఆర్ కింద రూ.115 కోట్లు అందిస్తే.. బాసంగి తదితర

(మిగతా 8వ పేజీలో...)

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సమస్యలు పరిష్కరించాం. తాగునీరు, రహదారుల నిర్మాణాలకు, సాలూరు, కురుపాం ఆసుపత్రి పనులకు నిధులు మంజూరు చేశాం. ప్రతి ఎకరాకూ సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఏనుగుల బెడదతో పాటు పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం అంశాలను అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

-గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..



సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. జంఝావతి హైలెవెల్ కెనాల్‌తో పాటు వీఆర్ఎస్ ద్వారా సాగునీరు అందించాలని, ఏనుగుల సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతా.

-బోనెల విజయచంద్ర, ఎమ్మెల్యే, పార్వతీపురం

సమస్యలు తెలియజేస్తా..



నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. కొండశిఖర, మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించాలని, పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు పూర్తి చేయాలని, ఏనుగుల సమస్యను పరిష్క రించాలని అసెంబ్లీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతా.

-తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే, కురుపాం

ఏనుగులను తరలించాలని కోరుతా..



నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. ప్రధానంగా ఏనుగుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేస్తా. తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని ప్రభుత్వాన్ని కోరుతా.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ



నందాపురం సమీపంలోని చెరువులో సేద తీరుతున్న ఏనుగులు

కొమరాడకు తిరిగొచ్చాయ్!

పార్వతీపురం రూరల్/ కొమరాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా పార్వతీపురం మండలంలో హల్‌చల్ చేసిన గజరాజులు ఆదివారం కొమరాడ మండలానికి చేరుకున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. కొద్దిరోజుల పాటు ప్రశాంతంగా ఉన్న వారికి మళ్లీ ఆందోళన మొదలైంది. ఏనుగులు తిరిగి రావడంతో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు. పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి కొమరాడ మండలం నందాపురం చేరుకున్న ఏనుగులు ఆ గ్రామంలోని చెరువులో కాసేపు సేదతీరాయి. అనంతరం సమీపంలోని తోటల్లోకి వెళ్లిపోయాయి. మరోవైపు అటవీశాఖాధికారులు పరిసర ప్రాంతవాసులను అప్రమత్తం చేశారు. ఏనుగులను పర్యవేక్షిస్తున్నామని, వాటివల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ రేంజర్ మనోజ్ తెలిపారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో ఏనుగుల గుంపు వల్ల ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోన్న భయం రైతుల్లో నెలకొంది. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

శంబర జాతర తేదీలు ఖరారు

- జనవరి 27న తొలేళ్లు
- 28న సిరిమానోత్సవం

మక్కువ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలు ఖరారయ్యాయి. ఆదివారం చదురుగుడిలో గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వచ్చే ఏడాది జనవరి 27న తొలేళ్లు, 28న సిరిమానోత్సవం, 29న అంపకోత్సవం జరపాలని నిర్ణయించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ ఏడాది 23న పెద్దమ్మవారు సనప చాటింపు, 30న పెద్దమ్మవారిని గ్రామంలోకి తీసుకురావడంతో జాతర ప్రారంభమవుతుంది. వచ్చే ఏడాది 6న పెద్దమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 7న ప్రధాన ఉత్సవం, 8న అంపకోత్సవం నిర్వహించనున్నారు. 13న చిన్నమ్మవారిని శంబర గ్రామంలోకి ఆహ్వానిస్తారు. నిత్యం అమ్మవారి ఘటాలు వీధుల్లో తిరుగుతుంటాయి. ప్రధాన పండగ వచ్చే ఏడాది జనవరి 27 నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 4న మారు జాతర జరగనుంది. మొత్తంగా పది వారాల పాటు పోలమాంబ జాతర జరగనుంది. చివరి వారం వనం గుడి ఆవరణలో చండీ హోమంతో పాటు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ జాతరకు ఛత్తీస్‌ఘడ్, ఒడిశా నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది తరలిరానున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో వీవీ సూర్యనారాయణ, సర్పంచ్ సింహాచలమ్మ, ఎంపీటీసీ పోలినాయుడు, అర్చకులు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



శంబర పోలమాంబ అమ్మవారు

అక్షరాలే దైవంగా..

- 'అక్షరబ్రహ్మ' పేరిట ఆలయ నిర్మాణం
- సవరలిపికి ప్రత్యేక పూజలు
- కార్తీకంలో దీక్షలు
- జంతు బలులు, సారాకు దూరం
- ఆధ్యాత్మిక చింతనలో ఆదివాసీలు

6లో

దీపోత్సవం

- శ్రీరామగిరి క్షేత్రంలో ఘనంగా లక్ష దీపారాధన

6లో

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- పర్యాటక ప్రాంతాల్లో సందడి

8లో



జనావాసాల్లోకి సాగునీరు

- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం
- కోన, గోపాలపురం వాసులకు తప్పని అవస్థలు



8లో



చెరువు నుంచి పంట పొలాలకు నీరు మళ్లిస్తున్న దృశ్యం

చి'వరి' కష్టాలు

- పంటకు నీరందించేందుకు రైతుల పాట్లు

భామిని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరి పంట ఆఖరి దశకు చేరుకున్నప్పటికీ రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం పొలాల్లో నీరు లేకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటకు తడి అందించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. చేతికి అందిన వరి పంట ఎక్కడ అందకపోతుందోనని నానాయాతన పడుతున్నారు. ఈ మేరకు చెరువులు, గెడ్డలు, గుంతల్లో నీటిని పైపుల ద్వారా పొలాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో 8,800 ఎకరాల్లో వరి సాగవుతుండగా సుమారు మూడు వేల ఎకరాల్లో పంటకు తడి పెడుతున్నారు. తుఫాన్ల కారణంగా వర్షాలు కురుస్తాయని బూర్జిగూడ, మూలగూడ, సవరపాడు, ఇసుకగూడ, అత్తికొత్తూరు, బాలరు, దిమ్మిడిజోల, భామిని, నులకజోడు, వడ్డంగి, బొమ్మిక తదితర గ్రామాల్లో రైతులు ఆశించారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఒకటి రెండు తడులు అందితేనే దిగుబడి వస్తుందని వారు వాపోతున్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా..

- కూటమి ప్రభుత్వం చర్యలు
- ఆసుపత్రుల్లో మార్పులు, చేర్పులకు శ్రీకారం
- నేడు జిల్లాకు వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ రాక
- రెండు రోజుల పాటు పర్యటన
- సమస్యలెన్నో...పరిష్కరిస్తే మేలు

పార్వతీపురం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పాటు వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వి.కరుణ, రాష్ట్రస్థాయి జాయింట్ డైరెక్టర్లు పర్యటించనున్నారు. సోమ, మంగళవారాల్లో 'మన్యం'లో పలు పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్రాసుపత్రి, సాలూరు, సీతంపేట, పాలకొండ ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలను సందర్శించనున్నారు. ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మందులు, పరికరాలు, సిబ్బంది సమర్థత వంటి అంశాలను పరిశీలించి.. వైద్య సేవల మెరుగుకు అవసరమైన సూచనలు అందించనున్నారని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి ఆదివారం తెలిపారు.


జిల్లా నుంచే ప్రారంభం

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును పరిశీలించనున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు ఆసుపత్రుల్లోని మౌలిక వసతులు, సదుపాయాలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు తదితర విషయాలను తెలుసుకోనున్నారు. అయితే జిల్లా నుంచే ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కమిషనర్ , జాయింట్ డైరెక్టర్లు రెండు రోజుల పాటు జిల్లాలో ఆసుప త్రులను సందర్శించి లోటుపాట్లను సరిదిద్దనున్నారు. భవిష్యత్తులో జిల్లా వాసులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో అత్యధికులు రక్త హీనత, సికిల్ సిలేమియాతో బాధపడుతున్నారు. మరెందరో క్యాన్సర్, మలేరియా, ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులతో సతమత మవుతున్నారు. అయితే రాష్ట్ర స్థాయి వైద్యశాఖ ఉన్నతాధికారుల పర్యటనతో జిల్లాలో పరిస్థితులు మారనున్నాయని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని జిల్లావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చర్యలు తీసుకుంటే..

- పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో గుండె ఇతర వైద్య నిపుణుల నియామకం, మౌలిక వసతులు, బ్లడ్ బ్యాంకు, ఐసీయూ ద్వారా మెరుగైన సేవలు అందించాల్సి ఉంది. దివ్యాంగులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీకి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలకు ప్రోగ్రాం అధికారులుగా పీహెచ్‌సీలకు చెందిన

-మిగతా 8వ పేజీలో...



పూర్తికాని సాలూరు ఆసుపత్రి భవన నిర్మాణం

నగర వనం.. పరవశం



నగర వనాలు ఆరోగ్యం, విజ్ఞాన, పిక్నిక్ కేంద్రాలుగా మన్నన పొందుతున్నాయి. సందర్శించిన ప్రతి ఒక్కరికీ అచ్చంగా వనమే అన్న భావన కలుగుతోంది. అక్కడున్నంత సేపు పరవశానికి లోనవుతున్నారు. ప్రవేశించిన దగ్గర నుంచి చెట్టు, పుట్ట, వాగు, వంక, చెరువు, గెడ్డ ప్రతీదీ ప్రకృతి పరవశమే. అదనంగా మట్టితో వాకింగ్ ట్రాక్, జిమ్, ట్రెక్కింగ్, దేశీయ మొక్కల పెంపకం, భూ సంరక్షణ వంటి పనులు చేపడుతున్నారు. అడవి జంతువుల ప్రతిమలు కూడా అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

- జిల్లాలో సారిపల్లి, బేతనాపల్లి, కొండవెలగాడలో ఏర్పాటు
- రెండుచోట్ల 80 శాతం పనులు కొలిక్కి
- అడవుల ఆవశ్యకతను తెలపడమే లక్ష్యం
- కేంద్రీయ నగర వన యోజన పథకం కింద జిల్లాకు రూ.4 కోట్లు మంజూరు
- పిక్నిక్ స్పాట్‌లుగా కూడా అపూర్వ ఆదరణ



ఆకట్టుకుంటున్న మృగరాజు

ఇంటరిప్షన్ కేంద్రంలో ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన జంతువులు, పక్షుల బొమ్మల కొలువు

విజయనగరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)

నగరాలు, పట్టణ ప్రజల్లో అడవుల ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నగర వనాలను తెరపైకి తెచ్చింది. 'కేంద్ర నగర వన యోజన పథకం' కింద కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి అటవీ శాఖ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేస్తోంది. జిల్లా పరిధిలో మూడు చోట్ల ప్రారంభించారు. డెంకాడ మండలంలోని బేతనాపల్లి రిజర్వ్ అటవీ ప్రాంతంలో 10 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.1.4 కోట్లతో నగర వనం అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పటికే రూ.70 లక్షల విలువ చేసే పనులు పూర్తి చేశారు. మరొకటి విజయనగరం ఫూల్‌బాగ్ నుంచి నెల్లిమర్ల మండలం సారిపల్లి పారిశ్రామిక వాడకు వెళ్లే దారిలో చంపావతి నదీతీరానికి, ప్రముఖ దిబ్బేశ్వర స్వామి ఆలయానికి దగ్గరలో 8 హెక్టార్లలో నగర వనాన్ని ఏర్పాటు చేశారు. ఈ నగర వనం ఏర్పాటుకు రూ. 1.2 కోట్లు నిధులు మంజూరు కాగా రూ. 53 లక్షలతో పనులు చేశారు. ఇదే మండలంలో కొండవెలగాడ రిజర్వు ఫారెస్టులో 10 హెక్టార్ల విస్తీర్ణంలో నగర వనం అభివృద్ధికి రూ. 1.4 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఇక్కడ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. 2018లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే నగర వనాల ఏర్పాటుకు బీజం పడింది. కూటమి ప్రభుత్వం రావడంతో వీటి పనులు మరింతగా ఊపందుకున్నాయి.



సారిపల్లి నగర వనం ప్రధాన ముఖద్వారం

- నగర వనాల్లో చెట్ల కింద రచ్చబండలు, రోడ్లుకు ఇరువైపులా అందమైన పూల మొక్కలతో ఏర్పాటు చేసిన ఉద్యాన వనాలు, కుటీరాలు, ఎంతో అందంగా, పరిశుభ్రంగా నిర్మించిన క్యాప్టీరియా, మరుగుదొడ్ల సౌకర్యాలు ఉన్నాయి. పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా ఇంటరిప్షన్ కేంద్రం..

నగర వనంలో ఏర్పాటు చేసిన ఇంటరిప్షన్ కేంద్రం చిన్న పిల్లలను ఆకర్షిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ కేంద్రంలో అడవి జంతువులు, సరీసృపాలు, పక్షులు, చెట్టు, పుట్ట, గుహలు, తాగునీటి కొలనులు, చిన్న చిన్న అడవి పిల్లులు ఎంతో సహజంగా, పిల్లలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

పర్యావరణంపై అవగాహనే లక్ష్యం..



నగర ప్రజలకు, విద్యార్థులకు అటవీ వాతావరణం, పర్యావరణంపై అవగాహన కల్పించడానికి నగర వనాలు దోహదపడతాయి. ముఖ్యంగా జీవ వైవిధ్యంపై అవగాహన ఎంతో అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిశగా అటవీ సంరక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఎంతో కృషి చేస్తున్నాయి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో సారిపల్లి, బేతనాపల్లి అటవీ ప్రాంతంలో రెండు నగర వనాలను ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కొండ వెలగాడలో కొద్ది రోజుల్లో రూ. 1.4 కోట్లతో 10 హెక్టార్లలో పనులు ప్రారంభించాల్సి ఉంది.

-బి.అప్పలరాజు, ఎఫ్ఆర్‌వో, విజయనగరం

బోధన భళా

- రాష్ట్ర స్థాయి అవార్డుకు ముగ్గురు ఉపాధ్యాయుల ఎంపిక
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అమితమైన అభిమానం
- నేడు ప్రభుత్వం నుంచి అవార్డు ప్రదానం

విజయనగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల గురుతర బాధ్యతను గుర్తించి.. విద్యార్థుల పట్ల వారు చూపిస్తున్న అంకితభావానికి రాష్ట్రప్రభుత్వం పట్టం కట్టింది. మాస్టార్ల సేవలను గుర్తించింది. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాకు చెందిన ముగ్గురిని ఎంపిక చేసింది. బొబ్బిలి వేణుగోపాలస్వామి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చిట్టిమోజు ఉషారాణి, విజయనగరం మండలం మలిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, ఎస్.కోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రసాయన శాస్త్రం ఉపాధ్యాయుడు తమ్మినాన రాజేష్ ఈ ఘనత సాధించారు. ముగ్గురూ పనిచేస్తున్న పాఠశాలలకు వన్నె తెచ్చారు. ప్రత్యేక బోధన పంథాతో విద్యార్థుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు రాజేష్

ఉషాకిరణమే!



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో ఉపాధ్యాయురాలు ఉషారాణి

చిట్టిమోజు ఉషారాణిది బొబ్బిలి మండలంలో పారాది గ్రామం. 2000 డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. 24 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. విద్యార్థులకు నైతిక విద్య అందించాలన్న ధ్యేయంతో పనిచేస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఏకంగా ఒక యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు. 'సుబోధిని' పేరుతో నడుపుతున్నారు. మై స్మార్ట్‌క్లాస్ వెబ్‌సైట్ నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నారు. కొత్త ఆవిష్కరణలను పరిచయం చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ చేపట్టే పాఠ్యపుస్తకాల రూపకల్పనలో సైతం పాలుపంచుకుంటున్నారు. పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తుంటారు. బొబ్బిలిలో నేతాజీ, జయప్రకాష్ పాఠశాలల్లో పనిచేశారు. ఇప్పుడు వేణుగోపాలస్వామి మునిసిపల్ స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంపై పట్టణవాసులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అభినందనలు తెలుపుతున్నారు.

అవార్డుల మాస్టారు..

శృంగవరపుకోట ప్రాంతంలో తమ్మినాన రాజేష్ మాస్టారు అంటే అందరికీ సుపరిచితం. ఆయనను అంతా అవార్డు మాస్టార్ అంటారు. 2003 డీఎస్సీతో ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టారు. 2005 మెరకముడిదాం మండలం ఉత్తరావల్లిలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. శాస్త్ర సాంకేతిక విద్యాబోధనలో దిట్ట. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడం ఆయన ప్రత్యేకత. ఆయన్ను వరుసగా అవార్డులు వరిస్తున్నాయి. 2023లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గురు పురస్కార్ వరించింది. 2018లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గురుదేవో అవార్డు పొందారు. 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి భారామతి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. 2019లో కేరళ ప్రభుత్వం సైతం బంగారు పతకం ఇచ్చి గౌరవించింది. 2020లో అయితే ప్రపంచ సముద్ర శాస్త్ర బహుమతి పొందారు. తాజాగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా నిలవడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో దిట్ట..

భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడుగా కె.ఓ.వి.ఎస్.ఎస్.ఎన్.ఆర్ సుబ్రహ్మణ్యానికి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. బోధనలోనూ మేటి. పనిచేసే పాఠశాలల్లో విద్యార్థులను వైజ్ఞానిక ప్రదర్శనలకు సిద్ధం చేయడం, వారి ప్రాజెక్టుల రూపకల్పన చేయడంలో సిద్ధహస్తుడు. ఈయన నేతృత్వంలో విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందిస్తే ఉత్తమంగా నిలవాల్సిందే. భావిభారత శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తుంటారు. ఈయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు జాతీయ, రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు ఎనిమిదిసార్లు వెళ్లాయంటే ఆయన పటిమ అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ అవార్డుతో పాటు రాష్ట్రస్థాయి అవార్డులను సొంతం చేసుకున్నారు. మరోసారి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా నిలవడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎనిమిది. పదో తరగతి పాఠ్య పుస్తకాల రచయితగా కొనసాగుతున్నారు.



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం

దీపోత్సవం

- శ్రీరామగిరి క్షేత్రంలో ఘనంగా లక్ష దీపారాధన

సీతంపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిపుట్టి పంచాయతీ పరిధిలోని రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరి క్షేత్రంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, దీపాలను వెలిగించారు. ఆలయ ఆవరణలో కార్తీక శోభ వెల్లివిరిసింది.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అక్షరాలే దైవంగా..



దేవాలయంలో పూజలు చేస్తున్న సంఘ సభ్యులు

- 'అక్షరబ్రహ్మ' పేరిట ఆలయ నిర్మాణం
- సవరలిపికి ప్రత్యేక పూజలు
- కార్తీకంలో దీక్షలు
- జంతు బలులు, సారాకు దూరం
- ఆధ్యాత్మిక చింతనలో ఆదివాసీలు



నౌగూడ గ్రామంలోని అక్షరబ్రహ్మ దేవాలయం

సీతంపేట రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): అక్షరాలే వారికి దైవం.. వాటిని నిత్యం పూజిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు సీతంపేట, భామిని మండలాల్లో ఆదివాసీలు. సవర లిపితో కూడిన అక్షరాలను ప్రతిష్ఠించి అక్షరబ్రహ్మ దేవాలయాన్ని నిర్మించిన వారు అక్కడ ఏడాది పొడవునా పూజలు నిర్వహిస్తుంటారు. కార్తీక మాసంలో దీక్షలు కూడా చేపడుతుంటారు. ఇప్పటికే మద్యం, మాంసం, జంతు బలులు, సారాను నిషేధించారు. సవరతెగలో పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను దూరం పెట్టి ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తున్న అక్షరబ్రహ్మ భక్తులపై ప్రత్యేక కథనం.

అసలు ఎలా మొదలైందంటే...

ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా గుణుపూర్‌కు సమీపంలోని మరిచ్చిగూడలో మొదటిగా అక్షర బ్రహ్మ దేవాలయం ఉండేది. సవర తెగలో అనాగరికం, జంతుబలి వంటి అనాగరికత పోకడలను మార్చాలని ఎస్‌వీ పండిట్ మంగయ్ భావించారు. ఈ తరుణంలో ఒక రోజు ఆయన కలలో భగవంతుడు ప్రత్యక్షమై గిరిజనుల కోసం అక్షరాల రూపంలో జన్మిస్తానని, తనను ఆరాధించాలని చెప్పినట్లు ఈ ప్రాంతవాసులు చెబుతుంటారు. అయితే వాటి కోసం అన్వేషిస్తున్న తరుణంలో మరిచ్చిగూడలోని ఓ కొండపైన 1936, జూన్ 18న సవరలిపితో కూడిన 24 అక్షరాలను గుర్తించారు. ఆ రోజు నుంచి వాటికి పూజలు చేయడం ప్రారంభించారు. అంతే కాకుండా సవరతెగ నివసించే గ్రామాల్లో ప్రచారం చేశారు. దీంతో సవర లిపి అక్షరాలకు దైవత్వం ఉందని ఆదివాసీల్లో బలమైన నమ్మకం ఏర్పడింది. భామిని మండలంలోని మనుమకొండలో ఎస్‌వీ మంగయ్య శిష్యుడైన నిమ్మల అప్పన్న గొమాంగో ద్వారా అక్షర బ్రహ్మ విశిష్టతను ఈ ప్రాంతానికి చెందిన గిరిజనులు తెలుసుకున్నారు. 1990 నుంచి నౌగూడలో పూజలు, భజనలు ప్రారంభించారు.

సీతంపేట, భామినిలో..

సీతంపేట మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నౌగూడ గ్రామంలో 2003లో ఎన్. అప్పన్న గొమాంగో ఆశీస్సులతో అక్షరబ్రహ్మ దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయంలో సవర భాషలో రుతువులు, కాలచక్రం, రాశులు, తిథులు అన్నీ లిఖించబడి ఉంటాయి. ఇక్కడ ప్రతిష్ఠించిన సవరలిపి అక్షరాలకు రోజూ పూజలు చేస్తుంటారు. కార్తీక సోమవారాల్లో అయితే గ్రామ గిరిజనులందరూ వేకువ జామునే నిద్రలేచి భక్తి శ్రద్ధలతో భజనలు, పూజలు చేస్తారు. మొత్తంగా 15 గిరిజన గ్రామాలు అక్షరబ్రహ్మ భక్తులుగా ఉన్నారు. ఇదిలా ఉండగా భామిని మండలం మనుమకొండ, పాలవలస, నూకాలమ్మ గూడ గ్రామాల్లోనూ అక్షరబ్రహ్మ దేవాలయాన్ని నిర్మించారు.

ప్రత్యేక పూజలు..

ఆదివాసీలు జరుపుకునే పండగ రోజుల్లో ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. కొండెం, టెంక, కందెంపువ్వు, మామిడి పువ్వు, చిరుధాన్యాలు కొత్తగలిసే పండగ సమయాల్లో రోజంతా గిరిజనులు అక్షర బ్రహ్మ దేవాలయంలోనే గడుపుతారు. అంతే కాకుండా అక్షర తృతీయ, కార్తీక పౌర్ణమి రోజున విత్తనాల పండగ నిర్వహిస్తారు. ఆ రోజున అన్ని రకాల విత్తనాలను అక్షర బ్రహ్మ దేవాలయానికి తీసుకువచ్చి గుడికి వచ్చే భక్తులకు పంచిపెడతారు. మరుసటి రోజున పూజలు చేసిన విత్తనాలను పొలంలో చల్లుతారు. ఈ విధంగా చేయడం వల్ల పంటలు బాగా పండుతాయని విశ్వసిస్తారు.

దీక్షలు..

ఏటా కార్తీకమాసంలో అక్టోబరు నెల 26 నుంచి 21 రోజుల పాటు అక్షరబ్రహ్మ భక్తులు దీక్షలు చేస్తారు. ఆ రోజు నుంచి సాయంత్రం వేళ నగర సంకీర్తన, భజనలను నిష్ఠగా చేస్తారు. వీరి దీక్ష కాలంలో ఉల్లిపాయను కూడ ముట్టరు. తెల్లని దుస్తులు, నుదుటిపై బొట్టుతో ప్రతి ఒక్కరిలో భక్తిభావం ఉట్టిపడేలా వీరి వేషధారణ ఉంటుంది. అక్షర తృతీయ రోజు నుంచి ఈ దేవాలయం వద్ద మూడు రోజుల పాటు యాత్ర నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులు ఇక్కడ తలనీలాలు సమర్పించి.. మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడే వంట వార్పు చేసుకుని కుటుంబాలతో కలిసి భోజనాలు చేస్తారు.



దీక్షల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్న అక్షరబ్రహ్మ భక్తులు

జంతు బలుల నిషేధం..

అక్షరబ్రహ్మ భక్తులు ఉన్న గిరిజన గ్రామాల్లో దున్నపోతులు, ఆవులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల వంటి జంతు బలులు, సారాను నిషేధించారు. పూర్వీకుల నుంచి వస్తున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా వారు జీవిస్తున్నారు. జంతు బలులతో కూడుకున్న ఆగం, పులి పండగలను దూరంగా ఉన్నారు.

ప్రతి ఒక్కరిలో భక్తిభావం..



అక్షరబ్రహ్మ భక్తులుగా మేమంతా మారాము. ప్రస్తుతం మా గ్రామంలో ఎటువంటి గొడవలు, హింసాత్మక సంఘటనలు జరగడం లేదు. జంతు బలులు కూడా నిషేధించాం. ప్రతి ఒక్కరిలో భక్తిభావం ఉట్టిపడుతుంది.

-సవర గురమయ్య, నౌగూడ

ఎంతో మార్పు వచ్చింది..



అక్షరబ్రహ్మ దేవాలయం నిర్మించిన నాటి నుంచి మాలో ఎంతో మార్పు వచ్చింది. అక్షర బ్రహ్మ భక్తులుగా ఉన్న గ్రామాలు ఎంతో ప్రశాంతంగా ఉన్నాయి. సీతంపేట ఏజెన్సీలో మొత్తంగా 14 గిరిజన గ్రామాల్లో ప్రజలు అక్షరాలను దైవంగా పూజిస్తున్నారు.

-సవర భాస్కరరావు, కోసమానుగూడ

ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయంగా పనిచేస్తుందని రాష్ట్రమంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో బొండపల్లి గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి అవసరాలు తీర్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నాయకులు అందుబాటులో ఉన్నప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని, కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ గుర్తించి పెద్దపీట వేస్తుందని సూచించారు. టీడీపీ సభ్యత్వాల నమోదు ప్రతి గ్రామంలో త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గంట్యాడ, బొండపల్లి మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, బొడ్డు రాముతోపాటు దేవుపల్లి, గొల్లుపాలెం, రాచకిండాం, చినతామరాపల్లి తదితర గ్రామాల నాయకులు రాపాక అచ్చంనాయుడు, పడాల అప్పలనాయుడు, నడుపూరి భాస్కరరావు, చింతలపాటి శ్రీనివాసరావు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో సమీక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

పలువురు టీడీపీలో చేరిక

గంట్యాడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) మండలంలోని నరవ గ్రామానికి చెందిన పలువురు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో ఆదివారం వైసీపీని విడిచి తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన మాజీ వైస్ సర్పంచ్‌తో పాటు మరో 18 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో మంత్రి సమక్షంలో చేరారు. కార్యక్రమంలోని మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, గ్రామ మాజీ సర్పంచ్ సుంకరి రామునాయుడు తదితరులు ఉన్నారు.

కక్షతోనే అనర్హత వేటు

● మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



మాట్లాడుతున్న ఇందుకూరి రఘురాజు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాపై కక్షతోనే అప్పటి వైసీపీ ప్రభుత్వం అనర్హత వేటు వేసిందని, నా భార్య పార్టీ మారిందనే కారణంతో తనపై కక్షసాధింపులో భాగంగా ఈ పరిణామం చోటు చేసుకుందని మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. హైకోర్టులో ఎమ్మెల్సీకి అనుకూలంగా తీర్పు వచ్చాక మండలంలోని బొడ్డవర గ్రామంలో విలేఖర్లతో మాట్లాడారు. తాను పార్టీకి ఏనాడు వ్యతిరేకంగా పనిచేయలేదని, పార్టీ సంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న సమయంలో కొన్ని కారణాల వల్ల రాజకీయకోణంలో మండలి చైర్మన్ తనపై అనర్హత వేటు వేశారన్నారు. కనీసం తన వాదన కూడా వినకుండా కేవలం వారంరోజుల వ్యవధిలో మూడు వాయిదాలు వేశారని, అప్పుడు తన ఆరోగ్యం బాగోక ఆసుపత్రిలో ఉన్నా పట్టించుకోకుండా తనపై అన్యాయంగా వేటువేశారన్నారు. ఈ సమయంలో తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించానని, కోర్టు తనపై మండల చైర్మన్ వేసిన అనర్హత కేసును కొట్టేసిందన్నారు. మరో మూడు సంవత్సరాలు తానే ఎమ్మెల్సీనని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం అదే జరుగుతుందని, ఈ ఉప ఎన్నిక ఖచ్చితంగా రద్దవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విజయనగరం టౌన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ-2024లో భాగంగా రెండు రోజులుగా వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన ప్రచార, నమోదు కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఎస్.శ్రీనివాసమూర్తి ఆదివారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని కణపాక పాఠశాలలో ఉన్న 25, 26, 27 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై బీఎల్వోలను ఆరాతీశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని బీఎల్వోలను ఆయన ఆదేశించారు. ఈ నెల 23, 24న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామభద్రపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులకు పార్టీ అధిష్టాన వర్గం సముచిత స్థానం ఇచ్చిందని విజయనగరం పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో ఆదివారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావుకు ఏపీ ఫారెస్టు డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడంపై అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. సుజయ్ కృష్ణరంగారావుకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడంపై వీరు హర్షం వ్యక్తం చేశారు. అలాగే బుడా చైర్మన్‌గా తెంటు లక్ష్మంనాయుడును నియమించడంపై కూడా వీరితో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

జనసేనలోకి మాజీ చైర్మన్లు



మాట్లాడుతున్న నడిపేన శ్రీనివాసరావు, శశిభార్గవి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయనగరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, ఆయన కుమార్తె మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, వైసీపీ మండల మహిళా పార్టీ అధ్యక్షురాలు జమ్ము శశిభార్గవి వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరనున్నట్టు ఆదివారం ప్రకటించారు. ఆదివారం జమ్ము గ్రామంలో స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో కార్యకర్త స్థాయి నుంచి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసినప్పటికీ, తనకు అండగా నిలిచే ప్రజలకు ఏమాత్రం న్యాయం చేయలేకపోయానన్నారు. మెగా కుటుంబం అభిమానిగా పవన్ పార్టీలో చేరుతున్నట్టు చెప్పారు.

నూతన సంస్కరణలతో నష్టమే

బొబ్బిలి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సంస్కరణలను పూర్తిగా వ్యతిరేకించాలని పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి అన్నారు. స్థానిక శ్రీనిధి పాఠశాలలో ఆదివారం రామభద్రపురం మండల యూటీఎఫ్ శాఖ స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహించారు. జి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయగౌరి మాట్లాడారు. 117 జీఓ, జాతీయనూతన విద్యావిధానం రద్దు కోసం భవిష్యత్‌లో ఐక్యఉద్యమాలను నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఆర్థికబకాయిల సాధన,పీఆర్‌సి వంటి కీలక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఆనందోబ్రహ్మ బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అయ్యరక సామాజిక వర్గానికి చేయూత నివ్వాలి

కొత్తవలస, నవంబరు10(ఆంధ్రజ్యోతి): అయ్యరక సామాజిక వర్గం వెనుకబడిన సామాజిక వర్గంగా ఉందని ఆ సామాజిక వర్గ ప్రతినిధులు అన్నారు. తమ సామాజిక వర్గానికి రాజకీయంగా, ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. రాష్ట్రఅయ్యరక పాత్రుడుల సామాజిక వర్గం కార్తీక సమారాధన కార్యక్రమం మండలంలోని బలిఘట్టాం గ్రామంలో నున్న మామిడి తోటలో ఆదివారం నిర్వహించారు.

రోలర్ స్కేటింగ్‌లో పతకాల పంట



స్కేటింగ్‌లో పతకాలు పంట పండించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం టౌన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 6 నుంచి 10 వరకు నిర్వహించిన 36వ ఇంటర్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2024లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ పోటీల్లో జిల్లాకు 5 బంగారు, 7 రజత, 8 కాంస్య పతకాలతో జిల్లా క్రీడాకారులు మెరిశారు. వీరిలో ఎస్.రాహుల్ సిద్ధార్థ, ఆర్.భార్గవ్‌సాయి, ఎల్‌జే దేవాన్స్ ఎస్.ప్రదీప్, పి.హాసిని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు కోచ్‌లను, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎ.ఆర్.వి.ఎన్.ఎస్.మూర్తి, సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మి, మోహన్‌రావు అభినందించారు.

మూతపడిన పాఠశాలను తెరిపించండి



ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న విద్యార్థులు

రాజాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజాం పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డులోని తిమ్మయ్యపేట గిరిజన గ్రామంలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తక్షణమే తెరిపించాలని విద్యార్థులు ఆదివారం ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. పదేళ్ల కిందట గిరిజన పాఠశాలలో 10 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్నారనే గ్రామంలోని పాఠశాలను మూసివేశారని గ్రామ పెద్దలు పాలవలస రాము, అమిటి బలరాం అన్నారు. ప్రస్తుతం 15 మంది చిన్నారులు, 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులు ఉన్నారని వీళ్ల ప్రతిరోజు రాజాం పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారని వివరించారు. గ్రామంలో 40 మంది మహిళలు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక భారంతో తమ పిల్లలను చదివిస్తున్నారని, ఇది తమకు తలకు మించిన భారంగా మారిందని రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇప్పటికే అందుబాటులో భవనం, వంటగది ఉందని అందులో తాత్కాలికంగా అంగన్వాడీ కేంద్రం నడుస్తుందని బొండపల్లి రవి తెలిపారు. తిమ్మయ్యపేట గ్రామ సమస్యలపై ఇప్పటికే శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖామంత్రికి వినతి పత్రం అందజేశామని, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఈ విషయంపై తగిన చర్యలు తీసుకుని తమకు ఉపాధి అవకాశాలతో పాటు తమ పిల్లలు చదవుకోవడానికి పాఠశాలను తెరిపించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు గిరిజన సంక్షేమ, శిశు సంక్షేమ శాఖ మంత్రికి, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారని, వారి ఆదేశాల మేరకు తెరిపించేలా చర్యలు తీసుకుంటామని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వాహనాల తనిఖీ

చీపురుపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లావేరు రోడ్డులో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎల్. దామోదరరావు మాట్లాడుతూ వాహనదారులు అన్ని రకాల పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై కేసులు నమోదు చేసి, సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే, సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి, వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సంతకవిటి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సంతకవిటి ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంతకవిటి మండల కేంద్రంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

కూటమి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధే



మాట్లాడుతున్న పడాల అరుణ

బాడంగి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ రాజ్యస్థాపనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పరిపాలన సాగుతోందని జనసేన నేత, మాజీ మంత్రి పడాల అరుణ అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో ఆదివారం గొల్లాది గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరుణ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో గిరడ అప్పలస్వామి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం హర్షనీయమని అన్నారు. గిరడ అప్పలస్వామి మాట్లాడుతూ రాజకీయాలకు, కులాలకు అతీతంగా వనమహోత్సవాన్ని నిర్వహించి అందరితో కలిసి ఆనందంగా విందు చేయాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పడాల అరుణతో పాటు గిరడ దంపతులు, రౌతు రామ్మూర్తి, రిటైర్డ్ తహసీల్దారు గిరడ అప్పలనాయుడు తదితరులను ఘనంగా సన్మానించారు.

వీడిపోమంటూ... వీడలేమంటూ..

● ఆనందోత్సాహాల మధ్య అపూర్వ కలయిక



ఆత్మీయ కలయికకు హాజరైన స్నేహితులు

రాజాం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజాంకు చెందిన ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (1970-89) సభ్యులైన స్నేహితులు గత 19 ఏళ్లుగా ఏటా కార్తీకమాసం రెండో ఆదివారం రాజాంలో కలుస్తున్నారు. ఈ ఏడాది సైతం 20వ ఆత్మీయ కలయికను రెండ్రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. శనివారం నుంచి రెండ్రోజుల పాటు స్నేహితులంతా ఆనందంతో గడిపారు. ఆదివారం అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. తమతో పాటు చదువుకుని వివిధ కారణాలతో మృతిచెందిన ఏడుగురి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. సుమారు మూడు గంటల పాటు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మించనున్న వేదిక నిర్మాణానికి ఆదివారం సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యూఎస్ నుంచి ఆత్మీయకలయిక కోసం వచ్చిన సునీత, యూఎస్‌ఏకు కుటుంబంతో కలిసి వెళ్లాల్సి ఉన్నప్పటికీ స్నేహితుల కోసం వాయిదా వేసుకున్న రామలక్ష్మి ఇలాంటి వారంతా ఎంతో సంతోషంగా ఇక్కడ గడిపారు. కేవలం తమ స్నేహితుల్ని చూడాలన్న కోరికతోనే నాగాలాండ్ నుంచి కాశీప్రసాద్ రాజాం వచ్చి చిన్నపిల్లాడిలా సందడి చేశారు. డాక్టర్ రఘు, కొత్తా సాయిప్రశాంత్ కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్ సారథ్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

న్యూస్ బాక్స్

ఉత్తమ ఉపాధ్యాయునికి అభినందన

విజయనగరం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సుబ్రహ్మణ్యంను కస్పా పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు గుప్తా, రంగారావు దొర, బాలు, దుర్గాప్రసాద్, గోపాల్ తదితరులు ఒక ప్రకటనలో అభినందించారు. కస్పా హైస్కూల్‌లో 1987 బ్యాచ్‌లో విద్యను అభ్యసించిన సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డారని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల్లో ఒకరిగా నిలవడం హర్షణీయమన్నారు.

భీమసింగిలో వైద్య శిబిరం

జామి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగి గ్రామంలో రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యుడు బాలమురళీ ఆధ్వర్యంలో విజయనగరం మహేంద్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 112 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

శంఖారావ సభకు తరలిరండి

చీపురుపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి 5న విజయవాడలో జరగనున్న శంఖారావ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని విశ్వ హిందూ పరిషత్ ప్రాంత ధర్మ ప్రచార సంయోజిక్ పొగిరి సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. చీపురుపల్లిలోని ఆర్య సమాజంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5న విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. విజయనగరం విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ శివప్రసాద్, ఎం. రమణ, వి. సతీష్‌కుమార్, కె. శ్రీనివాసరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికలు

విజయనగరం టౌన్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన పోటీలను డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి 150 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశామని అసోసియేషన్ అధ్యక్షులు టీవీ చారి తెలిపారు. టెక్నికల్ అఫీసియల్స్‌గా అనీల్ కుమార్, వినీష్ వ్యవహరించగా, రిఫరీలుగా రామకృష్ణ, మహేష్, రాజేష్‌లు వ్యవహరించారు. ఏపీపీ చంద్రశేఖర్, సభ్యులు వెంకటేష్, కె.శ్రీనివాస్, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

బొబ్బిలి రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లి గ్రామంలో ఆదివారం అన్నపూర్ణ ఆపన్న హస్తం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిలి అభ్యుదయ విద్యా సంస్థల ప్రిన్సిపాల్, జాతీయ మానవ హక్కుల దక్షిణ భారతదేశ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ చింతా శారద పాల్గొని ఆమె చేతుల మీదుగా వృద్ధులకు ఆహార పంపిణీ, దుప్పట్ల పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను వితరణ చేశారు.

నేడు జిల్లాకు ఎన్నికల పరిశీలకుడు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంఎం నాయక్ సోమవారం జిల్లాకు రానున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విజయనగరం కలెక్టరేట్: స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. అర్జీదారులు దీనిని గమనించాలని కోరారు.

మురుగునీటి శుద్ధి ప్లాంట్ కట్టొద్దు

బొబ్బిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పారిశుధ్య కార్మికుల కాలనీ(పాకీ వీధి)కి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో మురుగునీటి శుద్ధిప్లాంట్ నిర్మాణాన్ని కార్మికుల అభీష్టానికి భిన్నంగా అక్కడ నిర్మించవద్దని జిల్లా సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన ప్లాంట్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. అక్కడ కార్మికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్‌ను మానవత్వంతో అమలు చేయాలన్నారు. కార్మికులను బెదిరిస్తే వారికి అండగా నిలుస్తామన్నారు. సీపీఎం నాయకులు వి.లక్ష్మి, పి.శంకరరావు, యుగంధర్, వాసు, గౌరి తదతరులు పాల్గొన్నారు.

అదనంగా రూ.10 టోల్ ఫీజు

శృంగవరపుకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నుంచి వయా ధర్మవరం, తాటిపూడి రూట్లలో విజయనగరం రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సుల్లో అదనంగా రూ.10 టోల్ ఫీజును టిక్కెట్‌తో పాటు వసూలు చేస్తున్నట్లు డీఎం రమేష్ తెలిపారు. గంట్యాడ వద్ద సోమవారం టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

కిడ్నాప్ కేసులో మహిళ అరెస్టు

● తల్లి చెంతకు పసిబాలుడిని చేర్చిన పోలీసులు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పక్కనే ముసుగు ధరించిన నిందితురాలు

విజయనగరం క్రైం, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో కిడ్నాప్ అయిన ఎనిమిది నెలల బాలుడి ఆచూకీని వన్‌టౌన్ పోలీసులు కనిపెట్టారు. దీనికి సంబంధించిన వివరాలను విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఒడిసా రాష్ట్రం రాయగడకు చెందిన ఆశా సాహు తన భర్త, కుమారుడితో కలిసి కూలీ పని నిమిత్తం విజయనగరం వచ్చి ఎత్తుబ్రిడ్జి సమీపంలో ఉంటున్నారు. ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల సమయంలో నిద్రపోతున్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి పక్కనే ఉన్న బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకువెళ్లిపోయారు. విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే విశ్వకంచన అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఒక మహిళ కిడ్నాప్ చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వే స్టేషన్ కొన్ని ముఖ్యమైన ప్రాంతాలతో పాటు, పట్టణ శివారు ప్రాంతాల్లో గాలింపు, తనిఖీలు చేపట్టారు. కిడ్నాప్ చేసిన మహిళ దాసన్నపేట నాగవంశం వీధికి చెందిన కోరాడ సుశీలగా గుర్తించి, ఆమెను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి కిడ్నాప్ అయిన బాలుడిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసును ఛేదించిన డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ నరేష్, కానిస్టేబుల్స్ జిన్నాం శ్రీను, వెంకటరమణ, ధనలక్ష్మిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పాల్‌నగర్‌కు చెందిన కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఈ నెల 7న విశాఖపట్టణం వెళ్లి తిరిగి ఆర్టీసీ బస్సులో రాత్రి 10.30 గంటల సమయంలో విజయనగరంలో దిగి పీవీఆర్ ఆసుపత్రి రోడ్డుమీదుగా రైల్వే స్టేషన్ మోటార్ సైకిల్ స్టాండ్‌లో ఉన్న బైక్‌ను తీసుకోవడానికి వెళ్తుండగా, ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీ మీద వచ్చి లక్ష్మణరెడ్డి మెడలో ఉన్న బంగారపు గొలుసును తీసుకుని పారిపోయారు. వెంటనే బాధితుడు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేయగా ఎస్ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలించి స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తులను విజయనగరానికి చెందిన మహంతి వినోద్‌కుమార్ అలియాస్ వినోద్, పొట్నూరి డేవిడ్ రాజు అలియాస్ డేవిడ్‌ను కంటోన్మెంట్ అండర్ బ్రిడ్జి సమీపంలో అరెస్టు చేసి, వారి నుంచి బంగారపు గొలుసు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో క్రియాశీలకంగా వ్యవహరించిన ఇన్‌చార్జి సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సురేంద్రనాయుడు, హెచ్‌సీ అచ్చిరాజు, శ్రీను, సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాస్ అభినందించారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

లక్కవరపుకోట, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్యం(59) పురుగు మందు తాగి శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు సత్యం గత కొంత కాలంగా విపరీతమైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. కదలలేని స్థితిలో ఉండి ఆ బాధ తాళలేక శనివారం పురుగు మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా లాభం లేకపోయింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. దీనిపై మృతుని కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పశువులను తరలిస్తున్న లారీలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న 3 కంటైనర్ లారీలు

దత్తిరాజేరు, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న 3 కంటైనర్ లారీలను ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్టు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు మానాపురం సంత నుంచి అలమండ సంతకు అక్రమంగా పశువులను తరలిస్తున్న 3 కంటైనర్ లారీలను పట్టుకున్నామని, ఈ లారీల్లో 96 పశువులను తరలిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు లారీలను సీజ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు. లారీ యజమానులు కత్తిపూడి ప్రాంతానికి చెందినవారిగా గుర్తించామని ఆమె తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

గజపతినగరం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశంరాజపేట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న వారిపై దాడి చేసి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన గిరిజాల పోలినాయుడు అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. సర్కిల్ పరిధిలో నవంబరు ఒకటినుంచి ఇంతవరకు 11మందిపై కేసులు నమోదు చేసి 191 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్

వియనగరం క్రైం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత వారం రోజుల పాటు పోలీస్ యంత్రాంగం దాడులు నిర్వహించిందన్నారు. రాష్ట్రీయ రహదారికి ఆనుకొని ఉన్న రామభద్రపురం, బొబ్బిలి, బూర్జవలస, పెదమానాపురం పోలీసు స్టేషన్ల పరిధిలో వారం రోజులు దాడులు, వాహనాల తనిఖీ నిర్వహించి 11 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేయడంతో పాటు 11 వాహనాలను, 189 పశువులను సీజ్ చేశామని ఎస్పీ తెలిపారు. పశువులను అక్రమ రవానాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

'ఆశయ' రమణ కుటుంబానికి ఆర్థిక సాయం

చీపురుపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశయ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత రెడ్డి రమణ కుటుంబానికి చీపురుపల్లి లయన్స్ క్లబ్, స్టార్స్ క్లబ్‌లు 30 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు నగదును రమణ భార్య పుణ్యవతికి లయన్స్ ప్రతినిధులు అందజేశారు.

తుప్పలు తొలగించిన పోలీసులు

రేగిడి, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి): మండలంలో పాలకొండ-రాజాం రోడ్డుమార్గంలో ఇరువైపులా పిచ్చిమొక్కలు పేరుకుపోవటంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఎస్ఐ నీలావతి సిబ్బంది దృష్టి సారించారు. గత రెండు రోజులుగా జేసీబీతో ఉంగరాడమెట్ట పోలీస్‌స్టేషన్ నుంచి లచ్చరాయపురం వరకు జంగిల్‌తొలగింపు, రోడ్డు బాగుచేసే చర్యలు చేపట్టారు. వాస్తవంగా రాజాం ఆర్అండ్‌బీ శాఖ ఈ చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారికోసం చూడకుండా రేగిడి పోలీస్‌లు స్వచ్ఛందంగా ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు పోలీసులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

శృంగవరపుకోట నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శ్రీదారగంగమ్మ ఆలయ అశ్వర్థ దేవతా మహా వృక్ష సన్నిధిలో రెండు అడుగుల శ్రీసుబ్రమ్మణ్య స్వామిని ఉదయం 6గంటల నుంచి 12గంటల మధ్య ధాన్యాధివాసం జరుపుతున్నట్లు ఆలయ పూజారి రాజగోపాల్ పంతులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చే భక్తులు ధాన్యం తీసుకురావాలన్నారు.

వారిపైనే కొండంత ఆశలు!

(ఐదో పేజీ తరువాయి)

పది గ్రామాలు ఖాళీ చేయించి వారికి పునరావాసం కల్పించేందుకు అవకాశం ఉంది. అదే విధంగా భూసేకరణ కోసం మరో రూ.30 కోట్లు అవసరం.

● వీఆర్ఎస్, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ, పెదంకలం సాగునీటి ప్రాజెక్టులకు జైకా నిధులతో చేపడుతున్న పనులకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో సుమారు రూ.153 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది.

● అడారుగెడ్డ రిజర్వాయర్, జంఝావతి హైలెవెల్ కెనాల్ పనుల కోసం సుమారు రూ.50 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది.

● జంపరకోట ప్రాజెక్టు, కొండలోయిగెడ్డ, సీమలగూడ వద్ద మినీ రిజర్వాయర్, తోటపల్లి ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ఇరిగేషన్, గుమ్మడిగెడ్డ రిజర్వాయర్ పనుల పూర్తికి కూడా నిధులు అవసరం.

రహదారుల కోసం..

జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండతో పాటు ఏజెన్సీలో కొండశిఖర గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ తీరుతో దారుణంగా తయారైన రోడ్ల పరిస్థితిని అసెంబ్లీలో ప్రస్తావించి వాటికి మోక్షం కల్పించాల్సి ఉంది. ప్రజల కష్టాలకు చెక్ పెట్టల్సి ఉంది.

ఏనుగుల తరలింపునకు..

జిల్లావాసులను దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఏనుగులను ఈ ప్రాంతం తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై అసెంబ్లీలో గట్టిగా ప్రస్తావించాల్సి ఉంది. గజరాజుల కారణంగా సుమారు మూడు వేల ఎకరాలకు పైబడి పంట నష్టంతో పాటు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం జిల్లా కేంద్రానికి సమీపంలోనే గజరాజులు సంచరిస్తున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో జిల్లాలకు కుంకిలను తప్పించి.. ఈ ప్రాంతంలో ఉన్న ఏనుగులను తరలించాల్సి ఉంది.

తాగునీటి వసతి కల్పనకు..

ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. జల్‌జీవన్ పనులను కూడా పూర్తిచేయించలేకపోయింది. పార్వతీపురం జిల్లాకేంద్రం లోనూ తాగునీటి సమస్యను పరిష్కరించలేకపోయింది. దీంతో వేసవిలో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఏజెన్సీ వాసులైతే చలమలు, కొండల నుంచి వచ్చే నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కొండ శిఖర గ్రామాలతో పాటు మైదాన ప్రాంతవాసులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా మంత్రి, ఎమ్మెల్యేలు కృషి చేయాల్సి ఉంది.

మెరుగైన వైద్య సేవలే ధ్యేయంగా..

(ఐదో పేజీ తరువాయి)

వైద్యులు పనిచేస్తున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ప్రోగ్రాం అధికారులుగా అర్హులైన వైద్యులను కొత్తగా నియమించాల్సి ఉంది.

● జిల్లా కేంద్రాసుపత్రితో పాటు సాలూరులోని వంద పడకల ఆసుపత్రి, కురుపాంలోని సీహెచ్‌సీ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉంది.

● 24 గంటలు వైద్య సేవలు అందించే పీహెచ్‌సీలకు ముగ్గురు వైద్యులు ఎంతో అవసరం. పూర్తిస్థాయిలో స్టాఫ్‌నర్సులతో పాటు ఇతర వైద్య సిబ్బందిని నియమించాల్సి ఉంది.

● ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేందుకు వీలుగా ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మత్తు వైద్యులను నియమించాల్సి ఉంది.

పెదగుడబలో అగ్నిప్రమాదం

గరుగుబిల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదగుడబ గ్రామంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన పత్తిగోల రమేష్‌కు చెందిన కిరాణా దుకాణం పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. షార్ట్ సర్క్యూట్ కావడంతో ఈ ప్రమాదం నెలకొందని గ్రామస్థులు తెలిపారు. దుకాణంలో రెండు ఫ్రిజ్‌లు, మూడు తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయలు నగదుతో పాటు పలు రకాల వస్తువులు కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న పార్వతీపురం అగ్నిమాపక సిబ్బందికి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తమ జీవనాధారం కోల్పోవడంతో రమేష్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్వో కిరణ్‌కుమార్, కార్యదర్శి అల్లు రమేష్‌తో పాటు పలువురు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.6లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.



కిరాణా దుకాణంలో చెలరేగుతున్న మంటలు

అపస్మారక స్థితిలో యువకుడు

గ్రామానికి చెందిన ధర్మ అనే యువకుడు కిరాణా దుకాణానికి సరఫరా అవుతున్న విద్యుత్ లైన్‌ను తొలగించేందుకు స్తంభం ఎక్కిన సమయంలో షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించి వైద్య సేవలను అందిస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును గిరిజనులకు ఇవ్వాలి

జియ్యమ్మవలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో జియ్యమ్మవలస ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును గిరిజనులకు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బొడ్డవలస గ్రామ గిరిజనులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడారు. మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన తోటపల్లి సుజాత (ఎస్టీ)పై అవినీతి ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం విధుల నుంచి తొలగించారని, అప్పటి నుంచి టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా విధులు నిర్వహించారన్నారు. ఈ మధ్య కాలంలో కొత్తగా బీసీ కులానికి చెదిన వారిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వరి చొరవ చూపి గిరిజనులకు న్యాయంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బి.మోహన్‌రావు, గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగునాయుడు

సమస్యల పరిష్కారానికి శ్రమిద్దాం

పార్వతీపురంటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యల సాధనలో ప్రతి ఒక్కరం శ్రమిద్దామని రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో భవనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరగాల్సిన నూతన జిల్లాల సంఘాల ఎన్నికలతో పాటు సంఘ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 12 పీఆర్సీ, 11 పీఆర్సీ బకాయిలు, ఇతర ఏరియర్స్‌లను చెల్లించాలని, శాంతియుతంగా మన సంఘ తరుపున తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ నారాయణ, మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్య నారాయణ, ఆర్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి సాగు నీరు

» నిర్లక్ష్యం వహిస్తున్న ఇరిగేషన్ అధికారులు

» అవస్థలు పడుతున్న కోన, గోపాలపురం వాసులు



కోన గ్రామంలోకి చేరిన సాగునీరు

మక్కువ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూస్తుంటే వరదల సమయంలో నిల్వ ఉన్న నీరులా కనిపిస్తోంది కదూ.. కానే కాదు. ఇది ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. మండలంలోని వెంగళరాయసాగర్ జలాశయ పరిధిలోని 13ఎల్ కాలువ నీరు ఇలా జనావాసాల్లోకి చేరింది. ఈ నీటి ప్రవాహంతో మండలంలోని కోన, గోపాలపురం ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ కాలంలో రైతులు ఎంత శ్రమించినా నీటి బొట్టు ప్రవహించని కాలువలో ప్రస్తుతం మిగులు జలాలంతా కాలువ ద్వారా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం కోన, గోపాలపురం ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతుండడంతో రైతులు నీటితో అవస్థలు పడుతున్నారు. కాలువ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వృథా నీరంతా కాలనీలోకి చేరింది. దీంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. విష సర్పాలు వస్తున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కోన గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వడ్రంగి తన కర్ర సామాను మొత్తం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 13ఎల్ కాలువలోనికి వృథా నీరు రాకుండా అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

మమ అనిపించారు

● మండల సమావేశం బహిష్కరించిన సభ్యులు

సీతంపేట రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వైటీసీ కేంద్రంలో ఎంపీపీ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు మమ అనిపించారు. సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల నుంచి ముందస్తుగా సంతకాలు తీసుకున్న అధికారులు ఏ శాఖపై కూడా చర్చ జరగకుండానే సమావేశం ముగిసింది. సమావేశంలో మొత్తంగా 15శాఖల పై చర్చించాల్సి ఉండగా 10 శాఖలకు చెందిన కింది స్థాయి అధికారులు మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. సర్పంచ్‌ల దారిలోనే మిగిలిన ఎంపీటీసీ సభ్యులు కూడా అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. చేసేది లేక కోరం ప్రాప్తికి మండల సమావేశం జరిగినట్లు మండల పరిపాలనాధికారి మాస తెలిపారు. తమకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలను రాజ్యాంగేతర శక్తుల ద్వారా చేయిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ విధంగా వ్యవహరించడం ఏంటని వారు విమర్శించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ సత్యం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సాగర్, ఐకేపీ ఏపీఎం పి.కమలకుమారి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశం నుంచి బయటకు వెళ్లిపోతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

నామినేటెడ్‌లో జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాలి

బెలగాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి నామినేటెడ్ పదవుల రెండో జాబితా విడుదలపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆదివారం స్థానిక లైన్స్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాకు నామినేటెడ్ పోస్టులు కేటాయించకపోవడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు నిరాశలో ఉన్నారన్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ప్రాతిపదికన ఉన్న జిల్లాలో బీసీ నాయకులకు ప్రాధాన్యం ఇచ్చి నామినేటెడ్ పదవులు ఇచ్చేలా చూడాలని కోరారు.

సెలవు రోజు విధుల నిర్వహణ

పార్వతీపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది ఆదివారం కూడా కార్యాలయంలో పనిచేస్తున్న పరిస్థితి కనిపించింది. పని ఒత్తిడి వల్ల సెలవు రోజుల్లో కూడా సిబ్బంది పనిచేస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఉపాధి హామీ పథకం ద్వారా గోశాలల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్న పరిస్థితి ఉండడంతో సెలవు రోజున పని చేయాల్సి వస్తున్నట్టు తెలుస్తోంది.

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినం

సాలూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణంలో ఆదివారం అటవీశాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమర వీరుల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బంగారమ్మ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ రేంజర్ కె.తవిటినాయుడు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు గంగరాజు, దేవరాజు, శ్రీనివాసరావు, నారాయణరావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

తడిచిన ధాన్యంతో రైతుల ఇబ్బందులు

పార్వతీపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షం వల్ల వరిచేలు తడిచి ముద్దయ్యా యి. దీనివల్ల కోతలు కోసిన తర్వాత కూడా పంట రైతులకు పూర్తిస్థాయిలో ఇంటికి చేరని పరిస్థితి ఏర్పడింది. తడిచిన వరి పంటను పొలల్లోనే ఆరెబట్టుకుంటున్న పరిస్థితి ఉంది. వరి కోతలు పూర్తయిన తర్వాత ఈ వర్షం కురవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మరికొంతమంది రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న పరిస్థితి మండలంలో వివిధ ప్రాంతాల్లో కనిపించింది.



తడిచిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టిన దృశ్యం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గరుగుబిల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హత ఉన్నవారు ఓటరుగా నమోదు కావాలని ఉప తహసీల్దార్ బి.సుందరరావు కోరారు. రావివలసలో పోలింగ్ కేంద్రాలు 265, 266, 267, 268ను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఓటరుగా నమోదు కాకుంటే ప్రస్తుతం దరఖాస్తు చేసుకుంటే నమోదుకు అవకాశం ఉందన్నారు. 49 పోలింగ్ కేంద్రాల పరిధిలో తప్పులు లేని జాబితాల తయారీకి ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ పరిశీలనలో బీఎల్వోలు ఆర్.శశిభూషణరావు, గౌరీశంకరరావు ఉన్నారు.

● సీతానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అవసరమైన ఓటర్ల జాబితా తయారీకి సమగ్రమైన సమాచారంతో తుది జాబితాను సిబ్బంది సిద్ధం చేయాలని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు అన్నారు. వెంకటాపురం పంచాయతీ నీలకంఠాపురంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పబ్లికేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను గ్రామాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఓటు హక్కు పొందడానికి వచ్చిన రైతులు గోపాలనాయుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్టీ ప్రతినిధులు ఎం.తవిటినాయుడు, ఎం.పురుషోత్తంనాయుడు సూచించారు. ఆదివారం ఉల్లిభద్రలో పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లా స్థాయిలో ముందుండాలన్నారు. పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● కొమరాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వాలను వేగవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్‌పాత్రుడు అన్నారు. ఆదివారం కొమరాడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 31 పంచాయతీల్లో 21 పంచాయతీల్లోనే సభ్యత్వాల నమోదు చేస్తున్నారని, మిగిలిన పంచాయతీల్లో కూడా సభ్యత్వాలు వేగవంతం చేయాలన్నారు. అనంతరం మండలంలోని కొమరాడ, శివిని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నామినేటెడ్ చేసే సభ్యులతో పాటు గుంప సోమేశ్వరస్వామి, తోటపల్లి కోదండరామ, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు ట్రస్టీ సభ్యులను, కురుపాం ఏఎంసీ డైరెక్టర్లను నామినేట్ చేసేందుకు గాను సభ్యుల ఎంపికను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ● సాలూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వం ద్వారా ఎన్నో లాభాలు చేకురుతాయని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి) అన్నారు. ఆదివా రం సాలూరులోని నాలుగో వార్డులో ఆయన అధ్వర్యలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

సాలూరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక ఆదివారం కావడంతో సాలూరు మండలంలో జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. దళాయివలస, శిఖపరువు, లొద్ద జలపాతాలకు పర్యాటకులు తరలివచ్చారు. శిఖపరువు వద్ద బొబ్బిలి, సాలూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉత్సాహంగా గడిపారు. ● సీతంపేట రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసాయి. ఆడలి వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌కు పర్యాటకులు తాకిడి ఎక్కువయ్యింది.



సాలూరు రూరల్: శిఖపరువు గోముఖీ జలపాతం వద్ద పర్యాటకుల సందడి



సీతంపేట రూరల్: అడ్వంచర్ పార్కులో హ్యాంగింగ్ బ్రిడ్జ్‌పై..

సకాలంలో జీతాలు చెల్లించాలి

● కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగుల నిరసన

బెలగాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయబద్ధమైన తమ సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరంతరాయంగా రోగులకు సేవలు అందిస్తూ అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నామని, మూడు నెలలుగా జీతాలు లేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని 104 ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు చెల్లించి, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 104 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. డీఎస్సీ ఆర్వోఆర్ ద్వారా నియమితులైన 326 మంది డ్రైవర్లను ఇతర వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి జీవో నెంబర్ 7 అమలు చేసి జీతాలు చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ థర్డ్ పార్టీ చెల్లించాలని, వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ ప్రభుత్వం చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. భారీ ఎత్తున 104 ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

న్యూస్ బాక్స్

జలజీవన్ పనులు ప్రారంభం

వీరఘట్టం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొద్ది నెలలుగా నిలిచిపోయి జలజీవన్ మిషన్ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. తూడి గ్రామంలోని వీధుల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి కొళాయిలు అమర్చుతున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తీరుతాయి.

జట్టు సేవలు అభినందనీయం

పార్వతీపురంటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యో తి): స్వచ్ఛ సుందర పార్వతీపురంలో జట్టు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్ర శివారుల్లో గల జట్టు ఆశ్రమంలో నిర్వ హిస్తున్న వేస్టు మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం తీర్చిదిద్దేందుకు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం జట్టు ఆశ్రమ నిర్వహకులు పద్మజమ్మతో కలెక్టర్ కొంతసేపు ముచ్చటించారు.

ఏవోబీలో బెల్లం ఊట ధ్వంసం

సాలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏవోబీలో కొఠియా గ్రూపు నేరేళ్లవలస సమీప అడవుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహ మూర్తి ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేసి, వెయ్యి లీటర్ల బెల్లం ఊటలను గుర్తించి, ధ్వంసం చేశామని చెప్పారు.

ప్రజా పోరుకు తరలిరండి

సాలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరలు, నిరుద్యోగం తదిత ర ప్రజాసమస్యలపై ఈనెల 8 నుంచి తలపె ట్టిన ప్రజాపోరుకు జనం కదలిరావాలని సీపీఎం నేతలు మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏవోబీలో కొఠియా గ్రూప్ దిగువశెంబి, ఎగువ శెంబి తదితర గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించి, పోస్టర్ ఆవిష్కరించారు. ● బలిజిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 14వ తేదీన జరిగే ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎంఎల్ మన్మథరావు కోరారు. ఈ మేరకు ఆదివారం బలిజిపేటలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నెరవేరిన రహదారి కల

భామిని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా రహదారికి నోచుకోని నేరడి గ్రామ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గురండి నుంచి నేరడి, బుచ్చిమాను గూడ తదితర గ్రామాలకు ఉపాధి హామీలో మంజూరైన పనులు చేస్తున్నట్టు ఐటీడీఏ ఏఈ సత్యనారాయణ తెలిపారు. నేరడి రహదారికి రూ.63లక్షలు, జియ్యమాను రహదారికి రూ.1.5 కోట్లు వ్యయంతో పూర్తయిందన్నారు. నేరడి గ్రామానికి బీటీ రోడ్డు కావడంతో ఆ గ్రామ స్థులు ఆనందం వ్యక్తం చేశారు.

జేఏసీ కార్యవర్గం ఎన్నిక

సీతంపేట రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆదివాసీ ఉద్యోగ, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో జిల్లా జేఏసీ చైర్మన్ కె.ధర్మారావు అధ్యక్షతన ఏజెన్సీ ఆదివాసీ జేఏసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక సామాజిక భవనంలో వివిధ గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన జేఏసీ గౌరవ అధ్యక్షుడిగా హెచ్.రామస్వామి, అధ్యక్షుడిగా బిడ్డిక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా సవర సాయి కుమార్, ప్రధాన కార్యదర్శిగా సవర చిరంజీవులు, ఉప కార్యదర్శిగా నిమ్మక తిరుపతి రావు, సహాయ కార్యదర్శిగా సవర లక్ష్మణ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులు, కోశాధికారులను కూడా ఎన్నుకున్నామని అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు తెలిపారు.